క్లుప్తంగా

పశు వైద్యాధికారిగా శ్రీకాంత్


దువ్వాడ శ్రీకాంత్

మందస: మండల పశు వైద్యాధికారిగా డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన మందసకు వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే హరిపురం పశు వైద్యాధికారిగా డాక్టర్ కిల్లి ఉమాభారతిని ఉన్నతాధికారులు నియమించారు. ఆమె భేతాళపురంలోని వెటర్నరీ డిస్పెన్సరీలో పనిచేసేది.

'సేవలు వేగవంతం చేయాలి'


ట్యాబ్‌ల పంపిణీలో చైర్మన్ బళ్ల గిరిబాబు

కాశీబుగ్గ: సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలు మరింత వేగవంతం చేయాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు సూచించారు. స్థానిక మున్సిపల్ సర్వసభ్య సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ప్రస్తుతం జంట పట్టణాల్లో ఉన్న 16 సచివాలయాల అడ్మిన్లకు దిశానిర్దేశం చేసి అన్ని సచివాలయాలకు అందించారు. ప్రభుత్వ పథకాలను వేగవంతం చేయడం కోసం టాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లాన్ అధికారి సీతారాం, కౌన్సిలర్ బోనెల రాము, డబ్బీరు నాగు పాల్గొన్నారు.

పశుబీమా వినియోగించుకోండి


అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ డీడీ జయరాజ్

కోటబొమ్మాళి: వైఎస్సార్ పశు బీమాను పాడి రైతులు వినియోగించుకోవాలని టెక్కలి వెటర్నరీ డీడీ వి.జయరాజ్ సూచించారు. మండలంలోని కిష్టుపురం పంచాయతీ బలరాంపురం గ్రామంలో వైఎస్సా ర్ పశుబీమాపై రైతులతో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతుల నుంచి 44 పశు వులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. బీమా వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం, సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, కురుడు, తిలారు పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ప్రభున్నశ్రీ, వెటర్నరీ సిబ్బంది ఎస్.శాంతారావు, కోట ధర్మా రావు, వెలమల భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

'పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ మెప్మా కార్యాలయంలో 48 మంది ఆర్పీలు, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మెప్మా ఐబీ బెవర రాము, జిల్లా డీఎంసీ విజయకుమారి, శ్రీకాకుళం డీఎంసీ బోర భాస్కరరావు, పలాస-కాశీబుగ్గ సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి, సీవో స్వప్న కుమారి, డీఈవో బోర విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సచివాలయాలతో ప్రజలకు మేలు'

సోంపేట: సచివాలయాలతో ప్రజలకు అత్యంత మేలు జరుగుతోందని పలాసపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు అన్నారు. పలాసపురం సచివాలయంలో సోంపేట సబ్ రిజిస్టర్ తవిటయ్య ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలో రిజిస్ట్రేషన్లను బుధవారం ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ పత్రాలను కొనుగోలు చేసిన రైతులకు అందజేశారు. సచివాలయ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నేతలు

సోంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు బీసీ సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. సోంపేట పట్టణంలో బీసీ సంఘ ప్రతినిధుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి త్రినాథ్ బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నివర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. దుప్పల చలపతిరావు, బీన ఢిల్లీరావు, సానా షణ్ముఖరావు పాల్గొన్నారు.

కానుక.. వేడుక


ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో కిట్లు అందిస్తున్న ఎంపీపీ పుష్ప


కోటబొమ్మాళి: సరియాపల్లిలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భారతి తదితరులు


సోంపేట: గొనకపాడులో విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్


కోటబొమ్మాళి: ప్రాథమిక పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కాళ్ల సంజీవరావు

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని కొర్లాం పంచాయతీ గొనకపాడు ఉన్నత పాఠశాలలో విద్యా కానుక కిట్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.జోరాడు, ఎస్ఎంపీ చైర్మన్ గంగారావు, జాగృతి వ్యవస్థాపకుడు రాంబుడ్డి గణపతి, పార్టీ నాయకులు మోహనరావు, పాపారావు, శ్రీనివాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆధ్వర్యంలో, సరియాపల్లి ఎంపీపీ స్కూల్‌లో సర్పంచ్ పిట్ట భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు బుధవారం పంపిణీ చేశారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని టి.బరంపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు బుధవారం అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ తిప్పన ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: నియోజకవర్గంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతులమీదుగా బుధవారం అందజేశారు. శాసనాం గ్రామానికి చెందిన రాపాక కృష్ణారావుకు రూ.1 లక్ష, కిష్టుపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి ముఖలింగంకు రూ.1 లక్ష, అక్కయ్యవలస గ్రామానికి చెందిన సిమ్మ లక్ష్మీనారాయణకు రూ.30 వేలు, గురువెల్లిపేట గ్రామానికి చెందిన నూక సింహాచలంకు రూ.70 వేలు, చెరుకుపల్లి గ్రామానికి చెందిన రత్నాల సరస్వతికి రూ.60 వేలు, చాకిపల్లి గ్రామానికి చెందిన బొంగు పావనికి రూ.28 వేలు, జియ్యన్నపేట గ్రామానికి చెందిన నంబాల నందకుమార్‌కు రూ.1.40 లక్షలు, అన్నాపురం గ్రామానికి చెందిన బార్నాన దామోదర్‌కు రూ.1.50 లక్షలు, టెక్కలికి చెందిన కాశీ విశ్వనాథ్ జెన్నాకు రూ.40 వేలు చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ పి.జనకమోహన్‌రావు, నాయకులు యర్ర చక్రవర్తి, యు.విశ్వనాథం, ఎస్.మోహన్, బి.భాస్కరరావు, బి.శ్రీనివాస్, బి.సూర్యం, వీరాస్వామి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'మద్దతు ధర ప్రకటించాలి'


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పలాస: ఉద్దాన రైతుల జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర కల్పించి, నేరుగా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో జిల్లా అధికారులను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటకు మద్దతు ధరలు లేకపోవడంతో దళారులు పంటను దోచుకుంటున్నారన్నారు. జీడి పంటకు ధర లేకపోయినప్పటికీ, వ్యాపారులు మాత్రం జీడి పప్పు ధరలను పెంచుతునే ఉన్నారని మండిపడ్డారు. 80 కేజీల జీడి పిక్కలకు మద్దతు ధర రూ.16 వేలు ప్రకటించాలని, పలాసలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఉద్దాన ప్రాంతంలోనే జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రజా సంఘాల నాయకులు వంకల మాధవరావు, ప్రకాశ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి


సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 1902 జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. టెక్కలి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో స్థానిక కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే ఆయా సమస్యల పరిష్కారంలో చోటు చేసుకున్న పరిస్థితులపై ప్రతీ బుధవారం డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించనున్న స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు చేసి జరిమానా విధించారు.

'సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి'


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: వైఎస్సార్ రైతు భరోసా పథకం నగదు లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో ఖాతాల్లో జమ కాకపోతే, సమస్యలు పరిష్కరించి జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సంచాలకుడు కె.జగన్మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైతు భరోసా నగదు రూ.5,500 చొప్పున నాలుగు మండలాల్లోని 819 మంది రైతులకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో జమ కాలేదన్నారు. సమస్యల పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు నాలుగు మండలాల్లో 4,871 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి వ్యవసాయాధికారులు బి.నర్సింహమూర్తి, పి.శ్రీదేవి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో రైతులకు ప్రయోజనం


రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంచిలి: పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం డివిజనల్ యాంకర్ యశోద పేర్కొన్నారు. మండలంలోని జె.నారాయణపురం గ్రామంలో రైతులకు నవధాన్యాలు, పచ్చిరొట్ట, పప్పుజాతి గింజలు, నూనెజాతి గింజలు, కూరగాయలు విత్తనాలను కిట్ల రూపంలో ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఒక ఎకరాకు 10 నుంచి 12 కిలోలు చొప్పున వేసుకోవాలని సూచించారు. తొలకరి వర్షాల్లో పచ్చిరొట్ట, నవధాన్యాలు విత్తనాలు వేసుకొని, 45 రోజులుపాటు పొలంలో ఉంచి కలియ దున్నాలన్నారు. ఆ తర్వాత వరినాట్లు వేసుకోవడం వలన ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అందిస్తాయని, నేలలో వానపాములు పెరుగుతాయని తెలియజేశారు. సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు చిట్టిబాబు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు జాప్యం - డ్వాక్రా మహిళలకు శాపం

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా అందించిన డ్వాకా రుణమాఫీ సొమ్ము డ్వాక్రా సంఘాల్లో ఖాతాలకు ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరున జమ చేసింది. అయితే స్థానిక ఇండియన్ బ్యాంకు సిబ్బంది ఆసరా పథకం ఇచ్చి నెలన్నర రోజులు గడిచినా, డ్వాక్రా మహిళల వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు జమ చేయకపోవడంపై మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇండియన్ బ్యాంకు పరిధిలోని లఖందిడ్డి, శ్రీజగన్నాథపురం, గంగరాం, సరియాబొడ్డపాడు, ఎత్తురాళ్లపాడు, దంత, సరియాపల్లి, కొత్తపల్లి, చిన్నసాన తదితర గ్రామాల్లో 275 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు ప్రభుత్వం ఒక్కొక్క విడతలో సుమారు రూ.కోటి విడుదల చేస్తోంది. ఆసరా సొమ్మును వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని ఐకేపీ సిబ్బంది బ్యాంకుకు తీర్మానాలిచ్చినా, ఇంతవరకూ కేవలం 105 సంఘాల మహిళలకు సొమ్ము జమచేసి, మిగిలిన 170 సంఘాల సభ్యులకు సొమ్ము జమ కాలేదు. 275 డ్వాక్రా సంఘాల తీర్మానాలు సకాలంలో ఇండియన్ బ్యాంకుకు అందజేశామని, నేటి వరకూ 105 సంఘాలకు చెందిన మహిళలకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారని ,175 సంఘాల మహిళలకు బ్యాంకు సిబ్బంది డబ్బులు జమ చేయలేదని ఏపీఎం కె.రాము తెలిపారు. ఇండియన్ బ్యాంకులో పని ఒత్తిడి, సిబ్బంది కొరత కారణంగా కొన్ని సంఘాల మహిళలకు ఆసరా నిధులు జమ చేయలేపోయామని, త్వరలో అన్ని సంఘాల మహిలకు డబ్బులు జమ చేస్తామని ఇండియన్ బ్రాంచి మేనేజర్ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం


ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ నారాయణమ్మ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. మండలంలోని ఈదుపురం ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆణిముత్యాలు పేరుతో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడం గొప్ప విషయమన్నారు. బాసి ప్రసన్న, తరిణి కృతి, పిట్ట హేమసాయిలకు నగదు అందించడంతో పాటు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు వరప్రసాద్, హెచ్ఎం బి.తమ్మయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ సీరపు నరసింహమూర్తి పాల్గొన్నారు.

'సంత స్థలాన్ని ఐక్యంగా పరిరక్షించుకుందాం'


మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: గత 40 ఏళ్లుగా అంపురం వద్ద నిర్వహించబడుతున్న సంత స్థలాన్ని మండలంలో ఉన్న రైతులంతా కలిసి పరిరక్షించుకుందామని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వివిధ పంచాయతీల ప్రతినిధులు, రైతు ప్రతినిధులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ విషయమై మండల స్థాయి ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులతో ఎంపీపీ అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరి స్వార్థం కోసం కాకుండా సంత స్థలాన్ని కాపాడడానికి సమాలోచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం గతంలో రైతులంతా కలిసి కొనుగోలు చేసిన స్థలాన్ని కొందరు పెద్దలు పేరున రాసి ఇచ్చిన వారిని, వారి వారసులను స్వయంగా కలిసి సమస్య సామరస్యంగా పరిష్కరించుకుందామని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన రుద్రమూర్తి సలహా ఇచ్చారు. ఆయా పెద్దలు అంతా కలిసి వెళ్లి చెబితే తప్పనిసరిగా అంగీకరిస్తారనే నమ్మకం తనకుందన్నారు. మిగతా సభ్యుల్లో పలువురు ఈ సంత స్థలాన్ని కాపాడుకోడానికి ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మద్ది అప్పారావు, పలికల జయరాం, యారడి ఆనందరావు, బుడ్డెపు కామేష్‌రెడ్డి, న్యాయవాది బొండాడ పురుషోత్తం, పిలక చిన్నబాబు, కొల్లి ఈశ్వరరావు, లడ్డుకేశవపాత్రో, మద్ది ఆనంద్, మద్ది ఆదినారాయణ, లింగం కేశవరావు, పోలయ్య, నీలాద్రి, డొక్కరి నారాయణ, డొక్కరి దాలయ్య, గణప సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వ్యాన్ దగ్ధం

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి వద్ద జాతీయ రహదారిపై పక్కన మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో డీసీఎం వ్యాన్ దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన వంజరాపు వెంకటేష్‌కు చెందిన వ్యాన్ రోడ్డు పక్కన ఆపగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాసేపటికే వ్యాన్ దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా తెలిపారు.

ఈనాం భూములపై గ్రామసభ నేడు

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీ గుడివాడ గ్రామంలో సుమారు రెండు వందల ఎకరాల ఈనాం భూములపై గురువారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత రైతులు హాజరై తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ అడ్మిషన్లు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఉద్యోగం పేరిట మోసం

కోటబొమ్మాళి: ఆమదాలవలస పూజారిపేటకు చెందిన పైడి వెంకటసత్యనారాయణ ఉద్యోగం ఇప్పిస్తానంటూ తన వద్ద రూ.4లక్షలు తీసుకుని మోసం చేశాడని కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన పల్లి అప్పన్న బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా లక్ష రూపాయలు మాత్రమే తిరిగి ఇచ్చి రూ.3లక్షలు ఇవ్వకుండా మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు.

బోరు మరమ్మతులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 2వ వార్డు నెమలి నారాయణపురం గ్రామంలో బుధవారం మున్సిపల్ పవర్ బోర్‌కు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బడగల సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణలపై విచారణ

టెక్కలి రూరల్: స్థానిక భవానీ నగర్‌కి సమీపంలో ఉన్న 486 సర్వే నంబర్‌లో పట్టుశాలీ, సొండికులం, ముస్లిం, బ్రాహ్మణ సంక్షేమ సంఘాలకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురయ్యిందనే ఫిర్యాదుపై టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి దృష్టి సారించారు. సంఘ నాయకుల ఫిర్యాదు మేరకు ఈనెల 17 తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. సంఘాలకు కేటాయించిన స్థలాలను పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించారని ఆరోపిస్తూ సంఘాలకు చెందిన నాయకులు ఈనెల 5వ తేదీన సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టనున్నట్లు తెలియాజేస్తూ బుధవారం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.

పాఠశాలల సందర్శన

కంచిలి: మండలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలను ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్‌లు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా నువాగడ కాలనీలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల స్థితిగతులు, భోజనాల నిర్వహణ వంటివి తనిఖీ చేశారు. అదేవిధంగా నువాగడ, తుట్టాసాయి, నువాగడ కాలనీల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. వీరితో పాటు ఉపాధి హామీ ఏపీవో జి.ధనుంజయ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న దువ్వాడ వాణి

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నాయుడిని ఓడించేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి పిలుపునిచ్చారు. మండలంలోని జియ్యన్నపేటలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీ ఇంటిలో కోటబొమ్మాళి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం బుధవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, రైతు సలహా సంఘం జిల్లా సభ్యుడు కవిటి రామరాజు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు గెడ్డవలస నాగభూషణరావు, బొడ్డు అప్పన్న, బోనె ఎల్లయ్య, నేతింటి అప్పలస్వామి, గురువెల్లి సూర్యప్రకాష్, మెట్టు వాసు, వాన ఆదినారాయణ, ఎస్పీ రమణ, బమ్మిడి శ్రీనివాస్, బలగ సూర్యారావు, దండాసి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఆయా ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అర్హులైన వారికి పట్టాలు మంజూరు, హుద్‌హుద్ ఇళ్ల మంజూరు, మంచినీటి సమస్యలతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్య


ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నీలవేణి

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంతో పాటు చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అంగన్‌వాడీ సీడీపీవో పి.నాగరాణి తెలిపారు. 5, 6, 11 వార్డు సచివాలయం, 9, 10 వార్డుల సచివాలయం అధ్వర్యంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో జనభగీరథ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు పర పటి మంజులత, బచ్చు జగన్నాథం, పి. తేజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరటి కోటిరెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

బాలల భవితకు భాగస్వామ్యం

ఇచ్ఛాపురం రూరల్: బాలల భవితకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని ఐసీడీఎస్ సీనియర్ సూపర్‌వైజర్ ఎస్.నీలవేణి అన్నారు. మండలంలోని భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో జన భగీరథ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల విద్యా వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారులు పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట మామయ్యారెడ్డి, ఏఎన్ఎం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.